# ఎదురీత

గోరాశాస్త్రి

ఒక చిన్నకథ. ఏ మతంవాడయితేనేం - ఒకానొక మతగురువు - ఆలయంలో ఎలుగెత్తి గంభీరంగా ప్రార్థన చేస్తూ; మధ్యలో అకస్మాత్తుగా ఆగి, గుమికూడివున్న భక్తబృందాన్ని ప్రశ్నించాడట; 'మీలో నరకానికి వెళ్ళడానికి ఇష్టంలేనివాళ్ళంతా చేతులెత్తండి' అని. ఒక్క వెర్రివాడు తప్ప అందరూ చేతులెత్తారు. మతాధికారి మళ్ళీ ఆజ్ఞాపించాడు; 'సరే, మీలో స్వర్గానికి వెళ్ళడానికి కుతూహలంగా ఉన్నవాళ్లంతా చేతులెత్తండి' అని. తిరిగి ఆ వెర్రివాడు తప్ప అందరూ చేతులెత్తారు. మతాధికారికి ఆశ్చర్యంవేసి ఆ వెర్రివాడిని అడిగాడు. 'నాయనా! నువ్వు నరకానికీ వెళ్ళక, స్వర్గానికీ వెళ్ళక - మరి ఏంచేద్దామని?' వెర్రివాడు తొణక్కుండా బెణక్కుండా యిలా సమాధానం చెప్పాడు. 'స్వామీ! ఇప్పట్లో నా కెక్కడికీ వెళ్ళాలని లేదు. ఈ భూమ్మీద చూసుకోవలసిన పనులు చాలా ఉన్నాయి' అని.

ఇంకో చిన్నకథ! విదేశీయు డొకడు చిరకాలం అమెరికాలో ఉండి, తనకి అమెరికా పౌరసత్వపు హక్కు ఇప్పించవలసిందని అధికారులకి అర్జీ పెట్టుకున్నాడు. సకాలంలో అధికారు లతన్ని పిలిపించి, అతని కోరిక మంజూరు చేశారు. అమెరికా పౌరుడిగా అతనిచేత ప్రమాణ స్వీకారం చేయించేముందు, అమెరికా రాజ్యాంగంలో ప్రతి పౌరుడికీ ఉన్న అవకాశాల గురించి అతనికి బోధపరచాలని, అవీ యివీ అన్నీ చెప్పి, 'నీకు అమెరికా ప్రెసిడెంటు అవాలని ఉందా?' అని ప్రశ్నించారు. ఆ వెర్రివాడు వెంటనే 'క్షమించండి సార్! అటువంటి పనులకి వేటికీ నాకు తీరుబాటు లేదు. వీథులన్నీ తిరిగి అయిస్‌క్రీం అమ్ముకుందికి నాకు ఉన్న టయిమ్ చాలడంలేదు' అని ప్రాధేయపడ్డాడట, కొంపతీసి ఆ ప్రెసిడెంటు గిరీ తనకి అంటగడతారేమోనని భయపడుతూ.

ఈ వెర్రివాళ్ళిద్దరూ మనలో అధిక జనాభాకి ప్రతినిధులు. నేనూ ఆ కోవకి చెందినవాణ్ణే; అకస్మాత్తుగా ఎవరైనా మనల్ని నిలవేసి - నరకానికి వెళ్ళడం, అనేది తప్పించుకుంటావా? స్వర్గానికి వెళ్లాలని ఉందా? పోనీ, అమెరికా ప్రెసిడెంటు అవుదామనేనా లేదా? అసలు నీ ఆదర్శమేమిటి? రాజకీయవేత్తవై రాజ్యాలేలాలని ఉందా? పోనీ - మహాకవి, గాయకుడు, శిల్పి, విజ్ఞానవేత్త—ఏదయినా అయి యీ పతిత ప్రపంచాన్ని ఉద్ధరించకూడదూ? - ఇలాంటి ప్రశ్నలు వెయ్యడం లంకించుకుంటే మనం గుడ్లు తేలేస్తాం. గుండె బేజారెత్తుతుంది. అలా అడిగినవాళ్ళకి ఓ నమస్కారబాణం పారేసి, 'బాబూ, ఏదో యిలా మమ్మల్ని బతకనివ్వండి. ఏదో నాలుగు రాళ్ళు సంపాదించుకుని, గుట్టుగా కాలక్షేపం చెయ్యనివ్వండి. ఆదర్శాలమాట దేవు డెరుగు', అంటాం. అసలు అటువంటి ఆదర్శాల గొడవ చెవితేనే మన శరీరానికి పడదు. ఏదో ఆకలేస్తే అన్నం తిని, నానొస్తే గోడకేసుకుని, చలివేస్తే గొంగళీ కప్పుకుని, ఎవడైనా జబ్బపుష్టి కలవాడు డబాయిస్తే నోరు మూసుకుని, బక్కవాడు కనిపిస్తే నెత్తెక్కి స్వారిచేసి, పీకలమీదికొస్తే అబద్ధం ఆడేసి, ఉపకరిస్తే స్నేహం చేసి, లాభిస్తే ద్రోహంచేసి—మొత్తంమీద జీవయాత్ర నెట్టుకొస్తూ ఉంటాం. పచ్చగా ఉన్నచోట అరగించి, వెచ్చగా ఉన్నచోట నిద్రపోవడమే మన ఆదర్శం. పోతే యింకోరకం మనుషులు మనకి తారసిల్లుతూ ఉంటారు. పైకి చూడడానికి మామూలుగా అందరిలాగే కనిపిస్తారు గాని, కొస్త కదిపేసరికి వీరి మనస్సులూ, హృదయాలూ, యింద్రధనుస్సు రంగుల్ని ప్రతిఫలిస్తాయి.

మనకి ఏమాత్రమూ పట్టింపులేని విషయాల గురించి వీళ్ళు తెగ ఆలోచించి, ప్రతివిషయానికీ ఏవో కొన్ని చిత్రమైన నిబంధనల మధ్యే నలిగిపోతారు గాని బయటికి ఒక్క అడుగు వెయ్యరు. వీళ్ళని వేగడం మహాకష్టం. వీళ్ళలో ప్రతి ఒక్కడికి దూరాన మిణుకు మిణుకుమని ఒక చుక్క కనబడుతుంది. ఆ చుక్కని అందుకోవాలని నిరంతరం ప్రయత్నం చేస్తారు. ఎంత ప్రయాసపడినా, ఎంత దూరం నడిచినా, ఆ చుక్క యింకా దూరం అవుతుంది గాని వీళ్ళకి అందదు. ఏ నూటికో కోటికో ఆ చుక్క చేతికి దొరికి, తీరాచేసి అది కాస్తా గాజుముక్క అయిపోయిన విషాదఘట్టాలు కూడా ఉంటాయనుకోండి.

ముఖ్యం ఏమిటంటే - ఆ అన్వేషణ. ఇటువంటి విచిత్ర వ్యక్తులు జీవిత పటానికి నిలువుగా అడ్డంగా గీతలు గీసి ఆ గీతల్లో ఏవో స్వప్నాలు కట్టి అవి సాధించడానికి తాపత్రయ పడుతూంటారు. అంతవరకూ బాగానే ఉంది - మన జోలికి రానంతవరకూ. కాని దురదృష్టవశాత్తూ వీళ్ళతో గనక మనజీవితం పెనవేసుకుపోయిందంటే, మనల్ని ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించేస్తారు. వాళ్ళు సుఖపడరు; ఇంకొకర్ని సుఖపడనివ్వరు. వీళ్ళనే లోకం ఆదర్శవాదు లంటుంది.

ఈ భూమ్మీద మానవుడు పుట్టినప్పటినుండీ, యీ ఆదర్శవాదులనే వాళ్లు ఉన్నట్టే కనబడుతుంది. పురాణాలూ, ఇతిహాసాలూ, కావ్యాలూ - వీటినిండానే కాక చరిత్రలో కూడా వీళ్ళు సమృద్ధిగా గోచరిస్తారు. వీళ్ల మొదటి లక్షణం ఏమిటంటే, అసంతృప్తి. ఉన్న ప్రపంచాన్ని యథాతథంగా స్వీకరించరు. దాన్నీ అందులోని మనుషుల్నీ, మార్చాలని ప్రయత్నిస్తారు. పచ్చి మాంసం తినడంతో సంతృప్తిపడక నిప్పుచేయడం కనిపెట్టిన చాదస్తుడు, కాలినడకతో తనివి తీరక చక్రం కనిపెట్టి, దానికోసం బండి కనిపెట్టి, కాలినడక తప్పించుకోవడానికి ప్రయత్నించిన బద్ధకస్తుడు, ఉత్త వచనంతో సంతృప్తిపడక లయబద్ధంగా మాటలు పేర్చిన గడుసువాడు - వీళ్ళంతా అలనాటి ఆదర్శవాదులు. నాటినుండి నేటివరకూ ఏదో రూపాన వీళ్ళు పుట్టుకొస్తూనే ఉన్నారు. సమకాలికులికి చిరాకు కలిగి

స్తూనే ఉన్నారు. ఒకొక్కప్పుడు సమకాలికులకి మరీ తిక్క రేగేటంత మొండితనంతో ప్రవర్తించి పరిస్థితి మరీ దుర్భరం అయేసరికి సమకాలికులు యిక లాభంలేదని వాళ్లని హతమార్చేశారు. ఈ రకం మొండి వాళ్లలో గ్రీకు వేదాంతి సోక్రటీసు ఒకడు. అతడు చెప్పే చాదస్తపు కబుర్లూ, చేసే చిత్రమైన బోధనలూ, - సత్యాన్ని ఆరాధించండి - సత్యాన్ని తెలుసుకోండి - వగైరాలు విని సమకాలికులకి ఒళ్ళు మండి అతనికి ఓ గ్లాసునిండా మంచి చిక్కని విషం యిచ్చి 'బాబూ, నీ తలతిక్క వాగుడుతో మమ్మల్ని చంపక యీ విషం కాస్తా తాగేసి మమ్మల్ని ఉద్ధరించు;' అనేసరికి ఆ మొండివాడు గ్లాసుడు విషం కాస్తా తాగేశాడు గాని, తన ధోరణి మార్చుకుందికి ఒప్పుకోలే. ఈ కోవకి చెందినవాడే జీసస్ క్రైస్తు. ఇతని రంధ భరించలేక ప్రజలు చివరకి తీసికెళ్లి ఓ శిలవకి తాపడం చేసి మేకులు బిగించేశారు—అక్కడికైనా ఆ కంఠం విశ్రాంతి తీసుకుంటుందని. కాని ప్రతిసారీ, ఏం జరుగుతుందంటే వీళ్ళు బతికి సాధించిన దానికంటె, చచ్చిపోయి మరింత సాధిస్తారు. అదే వీళ్లతో వచ్చిన చిక్కంతా.

ఇటువంటి ఆదర్శవాదులు యీనాటి జీవితంలో ఎక్కడ ఉన్నారులే, - ఏదో పురాణాల్లోనూ, చరిత్రలోనూ తారసిల్లుతారని గాని. - అనుకుని సంతృప్తిపడడానికి వీలులేదు. కొంతలో కొంత యీ శతాబ్దంలో పుట్టినవాళ్ళం - అందులో శతాబ్దపు ఉత్తరార్థంలో బతుకుతున్నవాళ్ళం - అదృష్టవంతులం. ఎందుచేతంటే, వీపుమీద చెయ్యివేసి అనుక్షణం జీవితం మనల్ని నెట్టుకువెళుతూ ఉంటే, అదెక్కడికి తీసికెళితే అక్కడికి పోతున్నాం - ఆలోచించుకుందికైనా తీరికలేదు. ఇంక ఆదర్శాల గురించి ఎక్కడ తర్జన భర్జన చెయ్యగలం? బతకడం; అదీ మనకి ముఖ్యం. అందుకు ఏం కావాలి? ధనం; సరే దానిని వేటాడుదాం; దొరికితే ఆరాధిద్దాం. అంతరాత్మలనేవి అప్పుడప్పుడు బాధపెడితే యి గనక వాటికి జోలపాడి నిద్రపుచ్చేస్తాం. ఈ రకమైన జీవితానికి అలవాటు పడిపోయాం గనక, ఆదర్శాలనేవి అట్టే మనల్ని బాధపెట్టవు; ఆదర్శవాదులకి దూరంగా ఉంటాం గనక, వాళ్ళ వెర్రివాగుడు మనకి వినిపించదు.

ఆదర్శవాదం అనే రుగ్మత మొట్టమొదట తారుణ్యంలో అంకురిస్తుంది. అనేకులు పుట్టుకతోనే ముసిలివాళ్ళనుకోండి. వాళ్ల సంగతి వదిలేద్దాం. తారుణ్యంలో అడుగు పెట్టి పెట్టగానే - యీ జగత్తంతా తన



సంధ్యా సమయంలో అంధభిక్షుకుని ఆర్తనాదం

—చిత్రకారుడు: శ్రీ ఎ. వి. ఎస్. జోస్యులు (గుంటూరు)

కోసమే సృష్టించబడినట్టు ముందు అనిపిస్తుంది. వెంటనే ఒక్కసారి అంతా కలయచూసి లోపాలన్నీ కనిపెట్టేస్తాడు. 'ఆకాశంలో యీ నక్షత్రాలన్నీ ఏమిటి యిలా కలగాపులగంగా వెదజల్లేసి ఉన్నాయి; వాటిని ఒక క్రమంలో అందంగా పేరిస్తే ఎంత బాగుంటుందు;' అనుకుంటాడు. అలాగ ఆకాశంలో నక్షత్రాలనుండి, భూమిమీద మనుష్యులదాకా అన్నీ మారిపోవాలని తహతహలాడతాడు. ఇసుక ఎడారుల్లో బంగారు పంటలు పండించాలి. బిచ్చగాళ్లు ఐశ్వర్యవంతులవాలి. రోగగ్రస్తులు ఆరోగ్యవంతులై దుఃఖార్తులు ఆనందంలో కలకలా నవ్వాలి - యిలా జరగవలసిన పనులన్నీ జాబితా వేసుకుంటాడు. ఈ జాబితాలో అమాంబాపతు అన్నీ వచ్చేస్తాయి. బాల్యవివాహాలు కూడదు. వితంతువులకి పునర్వివాహం చేసుకునే అవకాశం ఉండాలి. పెళ్లిళ్ళలో కట్నాలు నిషేధించాలి. ప్రేమించి పెళ్లి చేసుకోవాలి. రైల్వేస్టేషనులోనూ, పోస్టాఫీసులోనూ - వగైరా చోట్ల ఉద్యోగులు ప్రజలతో మర్యాదగా

# ఎదురీత

వ్యవహరించాలి. ఉద్యోగులు లంచాలు తీసుకో కూడదు. - ఇలా యీ జాబితా అనంతం.

ఇటువంటి జాబితా తీసుకుని, చేతిలో చిన్న పొడసుత్తి పుచ్చుకుని, లోకాన్ని సురమ్మత్తు చేద్దామని బయలుదేరతాడు. అక్కడనుండి రభస ప్రారంభం. అడుగు వేసేసరికి ద్వారబంధాలు తగిలి కణత పగులుతుంది. క్రమంగా మైకం వదిలీ యీ జగత్తు నిజస్వరూపం గోచరించేసరికి చెయ్యెత్తి నమస్కరించేసి, పొడసుత్తి అవతల పారేసి, వచ్చి మనలో చేరిపోతాడు. అది బుద్ధిమంతుడి లక్షణం. అక్కడనుండి జీవితం సజావుగానే సాగిపోతుంది. నాన్న చేసుకోమన్న పిల్లనే పెళ్ళిచేసుకుని, అత్తవారిచ్చిన కట్నం. తృణమో పణమో పుచ్చేసుకుంటాడు. గీస్తున్న బొమ్మలూ, రాస్తున్న పద్యాలూ, అన్నీ అవతల పారేసి ఏం పని చేస్తే నాలుగు రాళ్లు వస్తాయో చూసుకుని, ఆ పనిలో నిమగ్నుడై సంతృప్తిగా బతికేస్తాడు. ఇంక అర్ధరాత్రివేళ ఏ అర్థం లేని కలా రాదు, రోడ్డుపక్క బిచ్చగాడిని చూసి అంతరాత్మ బాధ పెట్టదు. జీవితంలో ఏ ఘట్టంలో ఎలా ప్రవర్తించాలి, అనే సమస్య రాదు. నీళ్లు ఏపాత్రలో పోస్తే ఆ పాత్ర రూపాన్నే పుణికి పుచ్చుకున్నట్టు, పరిస్థితి తననుండి ఏ భంగిమ కోరితే ఆ భంగిమలోనే తయారవుతాడు.

ఈ రకంగా వస్త్రకాళం పట్టెయ్యగా అందరూ జారిపోయినా, నూటికీ కోటికీ ఏ ఒకడో అరో మనిషి మిగిలిపోతాడు వాడు సమేమిరా వస్త్రకాళం అయిపోవడానికి ఒప్పుకోడు. ఏమయినా సరే నిటారుగా నుంచుంటాడు; లొంగడు. కణతకి ఎన్ని బొప్పెలు కట్టినాసరే, వాడు నిర్ణయించుకున్న దారిలోనే నడుస్తాడు గాని, ఇంక దేనికీ ఒప్పుకోడు. అటువంటివాణ్ణి ఒప్పించడం బ్రహ్మతరం గాదు.

ఇందాకనే అనుకున్నట్టు యిటువంటి మొండివాళ్లు మనకి పురాణాల్లో కొల్లలుగా కనిపిస్తారు. ఇంచుమించు ప్రతి పురాణ పురుషుడూ యిటువంటివాడే; ప్రతిపురాణ నారీమణీ యిటువంటిదే. వాళ్ళ మొండితనం చూస్తే నాబోటి భవదీయుడికి భయం వేస్తుంది. పోనీ కొత్త ప్రబంధాలలోనైనా మనకి హాయైన మనుషులు కనిపిస్తారా అంటే - వాటిలోనూ తలతిక్కరాయళ్లే ఎక్కువ. వరూధినిలాంటి వరారోహ ప్రవరుడికి కొత్త లౌక్యం నేర్పి 'అనందో బ్రహ్మ యటన్న ప్రాజదువనంతర్బుద్ధి నూహింపుమా' అని నచ్చచెప్పడానికి ప్రయత్నించినా, లాభం లేకపోయింది. ప్రవరుడి ఆదర్శవాదానికి తిరుగు లేకపోయింది.

పోనీ వీళ్లంతా పుస్తకాల్లో మనుషులు-మనల్ని అట్టే బాధించరు, అనుకుని తృప్తి పడడానికి వీలులేకండా నేడుకూడా వీళ్లు నిత్య జీవితంలో తారసిల్లుతూండడం యీతి బాధల్లో ఒకటి కాక మరేమిటి? ఈ ఆదర్శ వాదుల్లో మళ్లీ రకాలున్నాయి. ప్రపంచ రాజకీయ స్వరూపం మార్చడానికి ప్రయత్నించే వారినుండి, అపక్వాహారాన్ని అందరిచేతా తినిపించాలని తాపత్రయ పడే వారిదాకా రకరకాల ఆదర్శాల అంతస్థులున్నాయి. వీళ్లలో కొందరి కొందరి ఆదర్శాలు మరీ చిత్రంగా ఉంటాయి. కాలేజీ రోజుల్లో నాకో స్నేహితుడుండేవాడు. అతగాడు వీరేశలింగంగారి పుస్తకాలు తెగ చదివి, ఆఖరికి—జీవితాదర్శాలలో పరమార్థం ఏమిటంటే, వితంతువుని పెళ్లిచేసుకోవడం అనే నిశ్చయానికి వచ్చాడు. అంతే; ఒక సుప్రభాతాన తన భీష్మప్రతిజ్ఞ తల్లికి తెలియజేశాడు. ఆమె తోక తొక్కిన పామువలె లేచి, 'నువ్వు కనక వితంతువివాహం చేసుకుంటే నేను బావిలో పడి చస్తాను' అని ఆమె యింకో భీష్మ ప్రతిజ్ఞచేసింది. ఇద్దరూ అదర్శవాదులే. తల్లి ఆదర్శం బాల్యవివాహం ... కొడుకు ఆదర్శం వితంతువివాహం. ఇంక ఏదీ దారి? ఇద్దరూ మాటాడుకుంటూంటె, విస్ఫులింగాలు లేచేవి. ఒకనాడు యిలాంటి ఘట్టాన్నే నేను కళ్లారా చూసి భరించలేక స్నేహితుణ్ణి చాటుగా పిలిచి అడిగాను; భాయీ; నీ ఆదర్శం దొడ్డదే, నేను కాదనను, కాని, నువ్వు పెళ్లాడ దలచుకున్న ఆ వితంతు రత్నం ఎవరో చెప్పు;' అన్నాను. స్నేహితుడు చిరునవ్వు నవ్వి 'అబ్బే; ప్రత్యేకించి ఫలానా వితంతువు అంటూ ఎవరూ లేరు. నేను పెళ్లాడ దలచుకున్న యువతి వితంతువై ఉండాలి. ఇంతే' అన్నాడు. 'అయితే అదికి ముందు యీ రగడ దేనికి? ఆసమయం వచ్చినప్పుడు చూసుకుందాంగా,' అన్నాను. అతగాడు లొంగలేదు. తన ఆదర్శాన్ని కాదనడానికి తల్లికి హక్కు లేదంటాడు. ఒకరోజున యీ ఆదర్శాల చర్చ మరీ ఎక్కువై, తల్లి అన్నంత పనీ చేసింది; అమాంతం బావిలో దూకి చచ్చిపోయింది. మావాడు కించిత్తయినా బాధపడలేదు...అందం ఎక్కడున్నదంటే, నేటికీ మా స్నేహితుడికి పెళ్లికాలేదు. అతడికి నచ్చిన వితంతువు దొరకక్క. నాకు నేటికీ బోధపడనిదేమిటంటే ఏ ఆదర్శం కోసం ఆ తల్లి బలియైపోయినట్టు?

నాణానికి బొమ్మ బొరుసూ ఉన్నట్టే, యీ ఆదర్శాలకికూడా బొమ్మ బొరుసూ ఉన్నట్టు నాకు తోస్తుంది. మూర్తికి ఛాయవలె, ప్రతి ఆదర్శాన్నీ వెన్నంటి కొన్ని అమానుషమైన క్రూరత్వాలు ఉండక తప్పదు. అయితే ఆదర్శంవల్ల సాధించబడేది ఉదాత్తమైనది అయినపుడు, వాటి యిబ్బందుల్ని తప్పనిసరిగా భరింపవచ్చు. కాని నా నేలలో పూటాసరుకువలె, ఏవి నిజంగా ఆదర్శాలు? ఏది చెరుకు చివర వెన్నువంటిది? ఈ ధర్మ సూక్ష్మాన్ని బోధపరుచుకోవడం నాబోటి వీధిమానిసికి తలకి

జంతు శాస్త్రం బోధించే ప్రొఫెసర్ క్లాసులోకి వచ్చి, కాలేజి విద్యార్థుల నుద్దేశించి యిలా ప్రసంగించాడు.

"ఈరోజు మీకు కప్ప శరీరంలో వుండే భాగాల్ని గూర్చి చెప్పబోతున్నాను. ఆభాగాలన్నీ కోసి ప్రత్యక్షంగా మీకు చూపెట్టటం కోసం, ఒక కప్పను కూడా తీసుకొచ్చాను" అంటూ తనకోటు జేబులోకి చేతిని పోనిచ్చి, కాగితం పొట్లం ఒకటి బయటికి తీశాడు. పొట్లం అంతా విప్పి చూస్తే, అందులో బిస్కట్ ముక్కలు వున్నాయి! ప్రొఫెసర్ కంగారు పడిపోయి, మిగిలిన జేబులన్నీ వెదికాడు. కప్ప కనిపించలేదు. ప్రొఫెసర్ కాస్సేపు తల గోక్కొని "ఐతే నేను యిందాక తిన్నది బిస్కట్లు కావు కాబోలు!" అని డోక్కోవటం మొదలు పెట్టాడు.


మించిన పని. జీవితం సరిగా బోధపడని ఎవరైనా ఒక అమాయిక కళాశీలి తన జీవితం అంతా చిత్రకారుడిగా గడపాలని నిశ్చయించుకుంటాడనుకోండి. అందులోనూ తనకి తోచిన ఆదర్శ చిత్రకళనే ఆరాధిస్తాడు గాని, వ్యాపార చిత్రకళజోలికి పోడు. ఇంకో వృత్తిచూసుకోడు. తను మాడిపోవడమే కాక, భార్యా బిడ్డల్ని సైతం మాడుస్తాడు. ఇటువంటివాడు మన జీవితంలో తారసిల్లితే ఏంచెయ్యడం? చిత్రకారుడి ఆదర్శం అక్కడితో ఆగితే కొంతనయం. కొన్ని సాధారణంగా అలా ఆగడం అంటూ ఉండదు. అతడికి చిత్రకళే గాక, ఆయుర్వేద వైద్యంకూడా ఒక ఆదర్శం అనుకోండి. భార్యకి జబ్బుచేసి చావుబతుకుల్లో ఉన్నా, రోగిని కాపాడేది యింకోరకం వైద్యం అని తెలిసినా, ససేమిరా లాభంలేదు. భార్య మరణిస్తే వచ్చే బాధకన్న తన ఆదర్శాన్ని వదిలేస్తే వచ్చే బాధ ఎక్కువది కనక, భార్యని వదలుకుని ఆదర్శాన్ని అంటిపెట్టుకుంటాడు. తను నమ్మిన ఆదర్శం తనను ఏవిధంగానూ దరి చేర్చదు. అయితేనేం—దాన్ని ఆచరించడంలోనే, ఏదో పరితృప్తి ఉంది.

ఈ రకం మనుషుల్ని మార్చి పరిస్థితులకి అనుగుణంగా నడుచుకొనేటట్లు చేయడం మనకి తలకిమించినపని. వీళ్లు అనుసరించే ఆదర్శాలలో కొన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే—అవి ఆదర్శాలు కావు, స్వభావాలు. 'నా ఆదర్శం అందరిచేతా మంచి అనిపించుకోవడం' అంటాడొకడు. దాన్ని ఆదర్శం అనేకంటే, గడుసుతనంగా, గాయాలు తినకుండా సుఖమయంగా జీవితం వెళ్లబుచ్చుకునే స్వభావం అనడంనయం. ఆదర్శాలు లేకపోవడం అనేది ఆదర్శం అనడం మాట చమత్కారం అవుతుంది; ఆదర్శానికి గీటురాయి ఏదో ఒక అవధి చేరుకుందికి ప్రయత్నించడం; తను నమ్మిన దాన్ని అక్షరాలా ఆచరించడం; 'బాబూ; ఎందుకు లేనిపోని రగడ; నువ్వు కోరిన పిల్లను పెళ్ళి చేసుకుంటే మా నాన్న ఆస్తిలో నీకు దమ్మిడీ యివ్వడు' అంటే యువకుడు వినడు. 'వెర్రివాడా; నీ దేశభక్తి చివరికి నిన్ను ఉరికంబం ఎక్కిస్తుంది;' అంటే దేశభక్తుడు వినడు. 'నాయనా, బొమ్మలు గియ్యడం, కవిత్వం అల్లడం మానేసి సబ్బులూ, పకోడీలూ అమ్ముకో; సుఖంగా బతుకుతావు' అంటే కళావేత్త వినడు, 'స్వామీ, ఈ సంఘంలో కుళ్లుని కదపకండి, అలాగే ఉంచి మీ పని మీరు చూసుకోండి;' అంటే సంఘ సంస్కర్త వినడు. 'ఏమయ్యోయ్; తిని కూర్చోక ఎవరెస్టు శిఖరం ఎక్కుతానంటావేమిటి? గడ్డకట్టిపోతావు, ఇంతా చేస్తే అక్క ఏముంటుంది. మంచు తప్ప;' అంటే సాహసికుడు వినడు...

కాని, ఇటువంటి అత్యాశవంతులే [illegible]ని ముందుకి నడిపిస్తారు.

(ఆలిండియా రేడియోవారి అనుమతితో)

★



కాలిన గోడలు : మాడిన మోళ్లు

అగ్ని ప్రమాదానంతరం తేలప్రోలులో కన్పించే దృశ్యం.

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహామచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.